క్లుప్తంగా

కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయొద్దు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయకుండా ఏ చిన్న సమస్య వచ్చినా వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని కంటి వైద్యనిపుణులు డాక్టర్ జయప్రకాష్ సూచించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భారత్ పెట్రోలియం లిమిటెడ్ రీజినల్ కార్యాలయంలో శనివారం కార్మికులకు వాసన్ ఐ కేర్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కంటి వైద్యులు జయప్రకాష్ కంటి పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ టెరిటరి మేనేజర్ తుషార్ జగతాప్, లయన్స్ జిల్లా గవర్నర్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్, ప్లాంట్ మేనేజర్ అరుణ్‌కుమార్, ఆప్తమాలజిస్టు తిరుతపమ్మ, శేషు, భారత్ గ్యాస్ సేల్స్ మేనేజర్ అనంతరావు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నిర్వహించండి

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో మెగా డీఎస్సీ నిర్వహించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప కోరారు. శనివారం బిర్లా కాంప్లెక్స్‌లోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను కూడా భర్తీ చేయాలని, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు, గ్రూప్ -1, 2 పోస్టులను పెంచాలని కోరారు. సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 21 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో టీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామరాజు, నాయకులు మోహన్‌నాయక్, ఉపేంద్ర, విష్ణునాయక్, సుంకేష్ నాయక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక సమస్య పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్):గోనెగండ్ల మండలం బి.అగ్రహారంలో శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ శనివారం డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు ను కలసి వినతిపత్రం ఇచ్చారు. ప్రస్తుతమున్న శ్మశాన వాటికను ఓ వ్యక్తి ఆక్రమించుకోవడంతో పాటు రస్తా పేరుతో కోర్టుకు వెళ్లడంతో ఎవరైనా చనిపోతే పూడ్చటానికి స్థలం లేకుండాపోయిందని గౌస్‌దేశాయ్ వివరించారు. విచారించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

మెరుగైన సేవలందించాలి

కర్నూలు(హాస్పిటల్): శిక్షణ పొందిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య సూచించారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలోని నర్సింగ్ కాలేజీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల మొదటి విడత శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శిక్షణలో భాగంగా పాము, తేలు, కుక్క కాట్లకు, రోడ్డు ప్రమాద బాధితులకు ప్రథమ చికిత్స చేయడం, గాయాలకు కుట్లు వేయడం, కట్టు కట్టడం, ఇంజెక్షన్లు వేసే విధానం, అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం గురించి నేర్పించారన్నారు. శిక్షణ పొందిన వారు ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం ఆయన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రోజారమణి, డీపీఓ విజయరాజు, నోడల్ ఆఫీసర్లు ఐజాల్ హక్, సుబ్రహ్మణ్యం, లెక్చరర్లు రుక్మిణి, సరళ, మంజుల, డెమో శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రైవేట్ టీచర్ ఇంట్లో చోరీ

కర్నూలు: గణేష్ నగర్‌లోని జంపాల అపార్ట్‌మెంట్ పక్కన నివాసముంటున్న రాజీవ్‌కుమార్ ఇంట్లో చోరీ జరిగింది. ఈయన నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని గుడ్‌షప్పర్డ్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 9న ఇంటికి తాళం వేసి అత్త గారిల్లు రాజంపేటకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి గదిలోకి వెళ్లి బీరువాలోని రూ.లక్ష విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను మూటగట్టుకుని ఉడాయించారు. ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో పక్కింటి వారు గమనించి శనివారం ఉదయం రాజీవ్‌కుమార్‌కు ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. సాయంత్రం ఆయన ఇంటికి చేరుకుని చోరీ జరిగిందని నిర్ధారించుకుని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్: బిచ్చగాడు 2, మేమ్ ఫేమస్,మెన్ టూ, ది లిటిల్ మెర్మయిడ్, ఫాస్ట్ ఎక్స్, 2018, ది కేరళ స్టోరీ
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : బిచ్చగాడు 2, మేమ్ ఫేమస్ , మెన్ టూ , 2018, విరుపాక్ష, ఏలియన్స్ 2042, అన్నీ మంచి శకునములే , ఫాస్ట్ ఎక్స్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : బిచ్చగాడు 2, విరుపాక్ష
ఐనాక్స్ : ఫాస్ట్ ఎక్స్, మేమ్ ఫేమస్, మళ్లీ పెళ్లి , మెన్ టూ, 2018
, ది కేరళ స్టోరీ, గ్రే : ది స్పై హూ లవ్డ్ మీ
భరత్ కాంప్లెక్స్ : ఫాస్ట్ ఎక్స్, కస్టడీ, విరుపాక్ష
శ్రీరామ : విరుపాక్ష
రాజ్ : మళ్లీ పెళ్లి
విజయ: బిచ్చగాడు 2

'కంటి వెలుగు'తో అందమైన ప్రపంచం

డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం ఎందరి జీవితాల్లో వెలుగులు నింపుతోంది. అప్పటి వరకు సరిగ్గా చూడలేని, అసలు చూడలేని వారికి చూపు ప్రసాదిస్తోంది. ఈ అందమైన ప్రపంచాన్ని చూసేందుకు అవసరమైన ఆసరా కల్పిస్తోంది. మూడేళ్ల క్రితం ప్రారంభమైన ఈ పథకం ఇప్పటికీ నిరంతరాయంగా కొనసాగుతూ కొన్ని వేలమంది కంటికి వెలుగును ప్రసాదిస్తోంది. – కర్నూలు(హాస్పిటల్)

- 6,73,728 మంది చిన్నారులకు, 1,46,479 మంది వృద్ధులకు కంటి పరీక్షలు
- 14,525 మంది చిన్నారులకు, 30,885 మంది వృద్ధులకు కంటి అద్దాల పంపిణీ



వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)



విద్యార్థినులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం(ఫైల్)

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం ఎంతో మంది పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. ఒకప్పుడు కంటి జబ్బులున్నా ఆసుపత్రి ఖర్చులకు భయపడి పరీక్షలు చేయించుకోవడానికి పేదలు వెళ్లలేని పరిస్థితి ఉండేది. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ప్రజల ముంగిటికే వైద్యులు వెళ్లి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. చిన్నచిన్న లోపాలున్న వారికి మందులు, దృష్టిలోపాలున్న వారికి కంటి అద్దాలు, కంట్లో సమస్యలున్న వారికి శస్త్రచికిత్సలు చేయిస్తూ కంటి వెలుగు ప్రసాదిస్తున్నారు. 2019 అక్టోబర్‌లో ప్రారంభమైన డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం మొదట్లో జోరుగా సాగింది. అయితే రెండు, మూడు నెలలకే కోవిడ్ రావడంతో బ్రేక్ పడింది. కరోనా ప్రభావం తగ్గడంతో తిరిగి 2020 నవంబర్ 2 నుంచి కోవిడ్ జాగ్రత్తలు పాటిస్తూ పరీక్షలను కంటి పరీక్షలు నిర్వహించారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. జిల్లాలోని 13 నియోజకవర్గాల్లోని 26 మండలాల్లో ఉన్న 426 గ్రామాలు, కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డులలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

6 లక్షలకు పైగా చిన్నారులకు కంటి పరీక్షలు

బాల్యంలోనే కంటి జబ్బులకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో కంటి వెలుగు పథకంలో చిన్నారులకు కూడా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. చిన్నతనంలోనే వారిలో కంటి జబ్బులను గుర్తించి వైద్యమందిస్తే పెద్దయ్యాక దుష్ప్రభావాలు కనిపించవనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతోంది. మూడేళ్లలో జిల్లాలో 4,351 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఐదు నుంచి 15 ఏళ్ల లోపు వయస్సున్న 6,73,728 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 37,329 మంది పిల్లలకు కంటి సమస్యలున్నట్లు గుర్తించారు. వీరిలో 14,525 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు.

లక్షన్నర మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు

జిల్లాలో వైఎస్ఆర్ కంటి వెలుగులో భాగంగా 60 ఏళ్లు పైబడిన అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని 2020 ఫిబ్రవరి 18న జిల్లాలోనే సీఎం జగన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 1,46,479 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేసి 30,885 మందికి కంటి అద్దాలు అందజేశారు. 24,925 మందికి కంట్లో శుక్లాలు రావడంతో వారికి ప్రభుత్వ, ప్రైవేటు కంటి ఆసుపత్రుల్లో ఉచితంగా కంటి శుక్లాల ఆపరేషన్లు నిర్వహించారు.

విస్తృతంగా కంటి వెలుగు కార్యక్రమం



జిల్లాలో వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులందరికీ అవసరమైన కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న పిల్లలకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశాం. అలాగే 60 ఏళ్లు పైబడిన వారికి సైతం కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశాం. వీరిలో శస్త్రచికిత్స అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం.

– డాక్టర్ జి.భరత్, జిల్లా అంధత్వ నివారణ అధికారి, కర్నూలు

నెలసరిపై మూఢనమ్మకాలు వీడాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): బహిష్టు(నెలసరి)పై ఉన్న మూఢనమ్మకాలను వీడాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య సూచించారు. శనివారం సాయంత్రం స్థానిక వడ్డేగేరిలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ రుతు పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని నెలసరి సమస్యల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.రామగిడ్డయ్య మాట్లాడుతూ స్త్రీలలో ప్రతి 28 రోజులకు ప్రకృతి సిద్ధంగా జరిగే జీవక్రియను రుతుక్రమం అంటారన్నారు. బాలికలకు 10 నుంచి 12 ఏళ్లలో రుతుక్రమం ప్రారంభమవుతుందన్నారు. రుతుక్రమ సమయంలో నీరసం, అలసట ఉంటుందని, విశ్రాంతి, ఆకుకూరలు, ఇనుము అధికంగా ఉండే పాలు, పాల పదార్థాలు, తృణధాన్యాలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. నెలసరి గురించి బాలికలకు వారి తల్లులు ముందుగానే అవగాహన కల్పించకపోతే రక్తస్రావాన్ని చూసి భయపడే ప్రమాదముందన్నారు. వైద్యాధికారి డాక్టర్ హకీమ్ మాట్లాడుతూ నెలసరి సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని, నెలసరి అయిన వెంటనే స్నానం చేయాలన్నారు. బట్టను/ప్యాడ్‌ను రెండు పూటలా మార్చాలని, బట్ట వాడినట్లయితే సబ్బుతో మరకలు పోయే వరకు ఉతికి వేడి నీటిలో జాడించి ఎండలో ఆరవేయాలని సూచించారు.

సీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఏడీఏ సాలురెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ఈనెల 30న పత్తికొండలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ రైతుభరోసా 5వ ఏడాది మొదటి విడత పెట్టుబడి సాయాన్ని పత్తికొండలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి బటన్ నొక్కి విడుదల చేయనున్నారన్నారు. ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏపీఎంఐపీ ఏపీడీ రాజాకృష్ణారెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు, ఆదోని ఏడీఏ గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గంగాధర్‌రెడ్డి



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎన్నికల పరిశీలకుడు

కర్నూలు(రూరల్): వాలీబాల్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గంగాధర్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకుడు ఖాదర్‌వలి తెలిపారు. శనివారం నగరంలోని గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని ఓ ప్రైవేట్ హాల్‌లో ఏర్పాటు చేసిన జిల్లా వాలీబాల్ సంఘం జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా షరీఫ్ అహ్మద్, కోశాధికారిగా దస్తగిరి రెడ్డి, ఉపాధ్యక్షులుగా నారాయణరెడ్డి, కలందర్ బేగ్, సంయుక్త కార్యదర్శులుగా ఫరూక్, లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు సుందర్‌రాజ్, షేక్ గరీబ్ బాషాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న వీసీ ఎ.ఆనందరావు

కర్నూలు (న్యూసిటీ): బ్యాంకింగ్ రంగంతోపాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు ఆకాంక్షించారు. ఆర్‌యూలో ×బ్యాంకింగ్, పోటీ పరీక్షల సన్నద్ధతж అంశంపై రెండు రోజుల అవగాహన సదస్సు శనివారం ముగిసింది. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కావాల్సిన చర్యలను యూనివర్సిటీ తీసుకుందని, భవిష్యత్ కోసం సరైన మార్గం ఎంచుకోవాలని వీసీ సూచించారు. వివిధ కోర్సులను అభ్యసించి ఉద్యోగ సముపార్జనను సులభతరం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుందరానంద పుచ్చ, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్‌రెడ్డి, గురురాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ నిర్వాహకుడు మౌలాలిరెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత వైపు నడిపిద్దాం



మాట్లాడుతున్న డైరెక్టర్ కేజే విజయ్‌కుమార్

కర్నూలు (టౌన్): ప్రతి ఒక్కరిని ఆధ్యాత్మికత వైపు నడిపించేందుకు కృషి చేయాలని యునైటెడ్ థియోలాజికల్ సెమినార్ డైరెక్టర్ కేజే విజయ్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక శరీన్ నగర్‌లోని మిలీనియం బాప్టిస్టు చర్చిలో శిక్షణ పూర్తిచేసుకున్న పాస్టర్లకు బ్యాచలర్ ఇన్ థియాలజీ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టా పొందిన వారిలో కనిగిరికి చెందిన నేరేళ్ల జగన్, మాధవస్వామి, చెంచు సుంకన్న, సత్యనారాయణ, యోహాన్, మారెమ్మ, సంధ్యారాణి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో దైవ సందేశకులు డాక్టర్లు ఫ్రెడ్రిక్ ఫ్రాన్సిస్, దీపక్ ఫ్రాన్సిస్, లిల్లీ దీపక్ ఫ్రాన్సిస్, పాస్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

రెడ్ సిగ్నల్ పడినప్పుడు ఇంజిన్లు బంద్ చేయండి



వాహన కాలుష్యాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కర్నూలు(సెంట్రల్): ట్రాఫిక్‌లో రెడ్ సిగ్నల్ పడిన సమయంలో మోటారు వాహనాల ఇంజిన్లను బంద్ చేస్తే కాలుష్యం తగ్గుతుందని ట్రాఫిక్ డీఎస్పీ భూషణం, పీసీబీ ఈఈ మునిప్రసాదు వాహనదారులకు సూచించారు. శనివారం మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా పీసీబీ, ట్రాఫిక్, రోడ్ ట్రాన్స్‌పోర్టు శాఖల ఆధ్వర్యంలో నంద్యాల చెక్కుపోస్టు, రాజ్‌విహార్, కలెక్టరేట్ ఎదుట ఉచిత వాహన కాలుష్య నియంత్రణ తనిఖీ శిబిరాలను నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాలం చెల్లిన వాహనాలను వినియోగించొద్దని, ట్రాఫిక్ నిబంధనలను పాటించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్ర మండలి ఎనలిస్టు గణేష్, రవాణా శాఖాధికారులు బాబు కిషోర్, స్వాతి పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలు అమలు చేయాలని ధర్నా



ధర్నా విరమించాలని కోరుతున్న పోలీస్ అధికారులు

కర్నూలు కల్చరల్: కర్నూలు కోట ఆంజనేయ స్వామి ఆస్తులను తిరిగి ఆలయానికి ఇవ్వాలని బీజేపీ, వీహెచ్ పీ, బజరంగ్‌దల్ నాయకులు శనివారం ఆలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులకు పోలీస్‌లకు మధ్య తోపులాట జరిగింది. ఆలయం ఆస్తులు ఆక్రమణదారుల నుంచి కాపాడి ఆలయానికి అప్పగించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని నాయకులు ఆరోపించారు. వారంలోగా అప్పగించకపోతే ధార్మిక సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కగ్గోలు హరీ ష్ బాబు, బజరంగ్ దల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, వీహెచ్‌పీ నాయకులు ప్రాణేష్, భానుప్రకాష్, శివ ప్రసా ద్, ప్రవీణ్‌యాదవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు డీఈఓ ఆఫీస్ ఎదుట నిరసన

కర్నూలు(సిటీ): ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ ఆన్‌లైన్ కాకుండా మాన్యువల్‌గా నిర్వహించాలని, అసంబద్ధంగా ఉన్న జీఓ ఎంఎస్ నంబర్ 47 లోని అంశాలను సవరించాలనే డిమాండ్లతో ఆదివారం డీఈఓ ఆఫీస్ ఎదుట నిరసన చేపట్టనున్నట్లు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ గోకారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

కర్నూలు(హాస్పిటల్): ప్రథమిక చికిత్సలో భాగమైన బీఎల్ఎస్, సీపీఆర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మెడికవర్ హాస్పిటల్ ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ సునీల్ యాదవ్ సూచించారు. వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్ డే సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం రాజవిహార్ సెంటర్‌లోని ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఏర్పాటు చేసిన అత్యవసర వైద్యం కార్యక్రమాన్ని ఎస్ఐ హుసేన్ ప్రారంభించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సెంటర్ హెడ్ నీలారెడ్డి, డాక్టర్లు శరత్, వినోద్, కళ్యాణ్, రామ్‌పవన్, ఆపరేషన్స్ హెడ్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

నేడు బీజేవైఎం సమావేశం

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా యువ మోర్చ (బీజేవైఎం) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం ఉదయం 10.30 గంటలకు కర్నూలు కన్వెన్షన్‌లో జరుగుతుందని బీజేవైఎం నాయకులు శనివారం తెలిపారు. బీజేపీ జాతీయ కార్యదర్శి, ఏపీ సహ ఇన్‌చార్జ్ సునీల్ దియోదర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివ నారాయణ, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి సమావేశంలో పాల్గొంటారన్నారు.

నెహ్రూ సేవలు మరువలేనివి

కర్నూలు(రూరల్): భారతదేశ మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు మరువలేనివని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌బాబు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు జాన్ విల్సన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఫోకల్ ట్రాన్స్‌ఫర్లు చేయొద్దు

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖలో ఫోకల్ టు ఫోకల్ బదిలీలు చేయవద్దని ఏపీ ఫార్మాసిస్టు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ వైద్య ఆరోగ్య శాఖ ఆర్‌డీ డాక్టర్ అనిల్‌కుమార్‌కు ఈ-మెయిల్ ద్వారా వినతిపత్రం పంపించారు. ప్రస్తుతం జరుగుతున్న పరస్పర అంగీకార (మ్యుచువల్) బదిలీల్లో ఫోకల్ టు ఫోకల్ బదిలీలు కూడా చేస్తున్నారని, దీనివల్ల ఇటీవల జోనల్ కేడర్ గుర్తింపు పొందినవారికి అన్యాయం జరుగుతుందని, స్పందించి ఫోకల్ బదిలీలను నిలిపేయాలని కోరారు.

అగ్నిప్రమాదం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ లోడ్ అధికం కావడంతో మేనేజర్ చాంబర్ వెనుక పెద్ద శబ్దంతో మంటలు చెలరేగాయి. అన్ని విభాగాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అప్రమత్తమైన ఎలక్ట్రీషియన్ రంగ మంటలను అదుపులోకి తీసుకువచ్చి, విద్యుత్‌ను పునరుద్ధరించారు. విషయం తెలుసుకున్న నగర మేయర్ బీవై.రామయ్య, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు.

గడువులోపు కనెక్షన్లు ఇవ్వండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ కనెక్షన్లు గుడువులోపు ఇవ్వాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ కె. శివప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన తిరుపతి ప్రధాన కార్యాలయం నుంచి ఇక్కడి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే వెంటనే ఎస్టిమేట్ వేసి డిమాండ్ నోటీసు ఇవ్వాలని సూచించారు. ఇందుకు సంబంధించిన డబ్బు చెల్లించిన వెంటనే కనెక్షన్లు ఇచ్చి మీటర్ అమర్చాలన్నారు. మీటర్లు అమర్చిన వెంటనే సీల్ బిల్ పెట్టి నంబర్ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. మీటర్ల ద్వారా విద్యుత్ అమ్మకాలు పెంచాలని, దీని వల్ల సంస్థకు ఆదాయం పెరిగేలా చూడాలన్నారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసి వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయాలన్నారు. కర్నూలులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి వివరించారు. సమావేశంలో ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

8 రోజుల శిశువుకు డయాలసిస్

- ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్స

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా పెద్దవారికి మాత్రమే మూత్రపిండాల సమస్య వస్తుందని చాలా మంది భావిస్తారు. కానీ 8 రోజుల శిశువుకూ ఈ సమస్య రావడంతో వైద్యులు ఎంతో జాగ్రత్తగా డయాలసిస్ చేసి బతికించారు. వివరాలను శనివారం కిమ్స్ హాస్పిటల్‌లో నియోనాలజిస్టులు డాక్టర్ హెచ్.ఎ. నవీద్, డాక్టర్ భరత్‌రెడ్డి, డాక్టర్ ఎస్.భారతి వివరించారు. వివరాలు వారి మాటల్లోనే... 'ఆత్మకూరుకు చెందిన షబ్బీర్ హుసేన్, అబూసలేహాలకు జన్మించిన 8 రోజుల శిశువుకు మూత్రపిండాలు పాడవడంతో కిమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పాప సరిగ్గా పాలు తాగకపోవడం, బరువు తగ్గిపోవడం లాంటి సమస్యలు ఉండటంతో నియోనెటాల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చేర్చాం. రక్తపరీక్షలు చేస్తే తీవ్రమైన డీహైడ్రేషన్ కారణంగా మూత్రపిండాలు పాడైనట్లు తేలింది. మూర్ఛకూడా వస్తుండటంతో వెంటిలేటర్‌పై ఉంచాల్సి వచ్చింది. క్రియాటినిన్ స్థాయి కూడా 16ఎంజీ/డీఎల్ ఉండటంతో మూత్రం సరిగ్గా రావడం లేదు. దీంతో మూత్రపిండాల నిపుణులు డాక్టర్ అనంత్ నేతృత్వంలో శిశువుకు పెరిటోనియల్ డయాలసిస్ మొదలుపెట్టాం. 5 రోజుల తర్వాత మూత్రపిండాల పనితీరు మెరుగుపడింది. 21 రోజుల పాటు ఎన్ఐసీయూలో ఉంచి చికిత్స చేసి ఇటీవలే డిశ్చార్జ్ చేశాం' అని వివరించారు. చికిత్స మొత్తం డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో పూర్తి ఉచితంగా చేసినట్లు వారు పేర్కొన్నారు.

ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కర్నూలు కల్చరల్: జిల్లాలోని హోటల్స్ ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి జి.విజయ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ హోటల్స్, లాడ్జీలు, రెస్టారెంట్లు, వెల్నెస్ సెంటర్లు, ట్రావెల్ ఆపరేటర్స్ అందరూ ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే రాష్ట్ర ప్రభుత్వ సర్టిఫికెట్‌తో పాటు పర్యాటక ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. హోటల్స్, రెస్టారెంట్స్, లాడ్జిలు గెస్ట్‌హౌస్‌లకు రూ.300, హోంస్టే, ఫాంస్టేలకు రూ.200, టూర్ బోట్ ఆపరేటర్స్ ఎడ్వంచర్ ఆపరేటర్స్‌కు రూ.500 ప్రకారం https://aptourism.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 63099 42034, 82477 04152 సంప్రదించాలని సూచించారు.

డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోండి

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని ప్రతి కార్యాలయం వద్ద డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రమాదేవితో కలిసి కలెక్టరేట్ ప్రాంగణంలో డస్ట్ బిన్లు ఏర్పాటు చేసేందుకు ప్రదేశాలను పరిశీలించారు. విజయ డెయిరీ, నగేష్ టీ స్టాల్ సమీపాల్లో ఎక్కువగా చెత్తాచెదారం పడి ఉంటుందని, వారు వెంటనే డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ చెత్త నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు పేపర్లు, ఇతర చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా డస్ట్ బిన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు చలపతిరావు జయంతి

కర్నూలు కల్చరల్: బ్రాహ్మణ సంఘం నగర మాజీ అధ్యక్షుడు కేవీ చలపతిరావు జయంతి వేడుకలను ఆదివారం సాయంత్రం 5 గంటలకు సంకల్ బాగ్‌లోని హరిహరక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కల్లె చంద్రశేఖరశర్మ, హెచ్‌కే రాజశేఖరరావు శనివారం తెలిపారు. ఏపీ హైకోర్టు జీపీ కె.వి. రఘువీర్, కరివేన సత్రం కార్యదర్శి డాక్టర్ ఎస్.వేణుగోపాల్, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూర హాజరు కానున్నారన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

కర్నూలు(రూరల్): ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాలో ఈనెల 30 నుంచి జూన్ 2వ తేదీ వరకు జరగనున్న ఖేలో ఇండియా పోటీల్లో రాయలసీమ యూనివర్సిటీ నుంచి వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న షేక్ అబ్దుల్లాకు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ సభ్యులు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాప, కె.శివరాం గౌడ్, వేణు, సీఐడీ కానిస్టేబుల్స్ ప్రవీణ్, సుధాకర్, దీపక్ పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో రాణించాలి



స్కేటింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు (రూరల్): చిన్నారులు స్కేటింగ్‌లో రాణించాలని రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, కంటి వైద్యనిపుణుడు పి.సుధాకర్‌రావు సూచించారు. శనివారం స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో స్కేటింగ్ రింక్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి క్రీడాశాఖ సీఈఓ పీపీ రమణ, ఒలింపిక్ సంఘం సీఈఓ విజయ్‌కుమార్‌తో పాటు డాక్టర్ సుధాకర్‌రావు హాజరయ్యారు. వేసవి శిబిరం పోటీల విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్కేటింగ్ సంఘం కార్యదర్శి సునిల్‌కుమార్, అబూబకర్, అవినాష్ పాల్గొన్నారు.

మేయర్‌కు వినతి



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న కోఆప్షన్ మెంబర్

కర్నూలు (టౌన్): నగరంలోని ప్రధాన రోడ్లలో డ్రైనేజీ వ్యవస్థలను మెరుగు పర్చాలని నగరపాలక కోఆప్షన్ మెంబర్ నయీమ్ శనివారం మేయర్ బీవై రామయ్యకు, కమిషనర్ భార్గవ్‌తేజకు వినతిపత్రాలు అందజేశారు. కళ్యాణ్ జ్యువెలర్స్ వద్ద వర్షం నీరు, మురుగు నీరు నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. వచ్చే నెలలో నిర్వహించనున్న నగరపాలక సర్వసభ్య సమావేశంలో డ్రైనేజీ పనులకు ఆమోదం తెలపాలని కోరారు.